అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- మూడు గ్రామాల్లో సాగిన ప్రజాసంక్షేమయాత్ర


గుడిపాడులో ప్రజాసంక్షేమ యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


గుడిపాడులో వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం గుడిపాడులో ప్రారంభమైన నాలుగో విడత ప్రజా సంక్షేమ పాద యాత్ర కుందనకోట, చింతలాయపల్లె గ్రామాల్లో సాగింది. మొదట గుడిపాడు గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాత్రను ప్రారంబించారు. ఎమ్మెల్యేకు సర్పంచు దండు సావిత్రి, ఉప సర్పంచు శ్రీనివాసులు, ఎంపీపీ చెన్నప్ప నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెత్త ఎత్తున స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. నియోజక వర్గంలోని పెద్దవడుగూరు, పెద్దప్పూరు, తాడిపత్రి, యాడికి మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. గుడిపాడు, కుందన కోట మధ్యలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పేరం స్వర్ణలత, రమేష్ రెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్‌లు హరినాథరెడ్డి, ఓబుళరెడ్డి ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తంచేవన్నారు. తమ ప్రభుత్వంలో కులమత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు జగనన్న పాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య వచ్చినా తాను తప్పక తీరుస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

గుడిపాడు గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా నవరత్నాల పథకాలతో పాటు అనేక కార్యక్రమాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వ పథకాలతోపాటు సేవలను ప్రజల గుమ్మం వద్దే అందిస్తున్నారన్నారు. గతంలో మూరుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలు సర్టిఫికెట్ కోసం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడేవారన్నారు. గ్రామంలో సచివాలయం ఏర్పడటంతో మండల కేంద్రానికి వెళ్లే పనేలేకుండా పోయిందన్నారు. కుందనకోట, గుడిపాడు గ్రామాల ప్రజలకు అనారోగ్యం పాలైనప్పుడు వైద్యం కోసం మండల కేంద్రానికో, తాడిపత్రికి పోయేవారన్నారు. కానీ ఇప్పుడు గ్రామంలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామాలోనే వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. పథకాలను నేరుగా లబ్ధిరులకే అందిస్తున్న జగనన్న మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చలమారెడ్డి, నాయకులు పేరం వాసుదేవుడు, వెంకటరామిరెడ్డి, దండు రాముడు, దండు లక్ష్మణ్, కుందనకోట సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, యలమ రామచంద్రుడు, జగదీష్, నరేంద్ర, కంబగిరిస్వామి, పెద్దపుల్లయ్య, జేసీఎస్ కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసంక్షేమ యాత్ర ఇలా..

మండలంలోని చింతలాయపల్లెలో బుధవారం ఉదయం ప్రజాసంక్షేమ యాత్ర ప్రారంభం కానుంది. బోయరెడ్డిపల్లి, చిక్కేపల్లే మీదుగా నిట్టూరు గ్రామానికి చేరుకుంటుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి


పెద్దవడుగూరు తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

పెద్దవడుగూరు : భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. పెద్దవడుగూరు లో 2015–16 లో డీఎంఎఫ్ ద్వారా 3 లక్షల నిధులతో పైపులైన్ పనులు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ బిల్లులు మంజూరు చేయలేదని ఫిర్యాదు రావడంతో జేసీ మంగళవారం పరిశీలించారు. బిల్లుల మంజూరులో ఎందుకు జాప్యం జరిగిందో అడిగి తెలుసుకొన్నారు. గతంలో పని చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ హఠాత్తుగా మరణించారని, అప్పట్లో ఆయన బిల్లులు పెట్టారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లులను త్వరగా పంపాలని జేసీ సూచించారు. తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్న జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేరాల నియంత్రణపై స్పెషల్‌పార్టీ సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు నియమించిన స్పెషల్‌పార్టీ సిబ్బంది క్రమశిక్షణతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, శాఖకు గుర్తింపు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆయన స్పెషల్ పార్టీ పోలీసులకు ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా వారికి ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు. సబ్ డివిజన్ స్థాయిలో స్పెషల్ పార్టీ టీంలలోని సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలన్నారు. ఆయా సబ్ డివిజన్‌లలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వీవీఐపీ బందోబస్తు, ఉత్సవాలు, ఊరేగింపులు, రోప్ పార్టీలు, ఆందోళనల నియంత్రణ, ట్రాఫిక్ సమస్య తలెత్తిన సమయాల్లో డీఎస్పీల నేతృత్వంలో ఎలా పని చేయాలో అవగాహన కల్పించారు. స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఇష్టంగా విధులు, బాధ్యతలు నిర్వర్తిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యంపైనా శ్రద్ధచూపాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ మునిరాజ్, ఆర్ఎస్ఐలు రాజశేఖరరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డీ అడిక్షన్ సెంటర్ పరిశీలన

సర్వజనాస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌ను ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను బుగ్గి చేసుకోవద్దని సూచించారు. డీఅడిక్షన్ సెంటర్‌కు వచ్చి ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్‌స్టాప్ సెంటర్ అని జిల్లా ఎస్పీ అన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అనేక సేవలందుతున్నాయన్నారు. అనంతరం స్థానికంగా ఉంటున్న ఉజ్వల హోం, జువైనల్ హోం, సీడబ్ల్యూసీ కార్యాలయాలను ఎస్పీ సందర్శించారు. అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్, ఎస్పీ సీఐలు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన నాగరాజు(55) అనే వ్యక్తి అనుమాన స్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అయితే నాగరాజు పొలానికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అనంతపురం నుంచి తిరిగి వచ్చాక నాగరాజు ఇంటిలో కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ నాగరాజు విగతజీవుడై కనిపించాడు. కుటుంబ సభ్యులు అదిని స్థానిక ఆసుపత్రికి తరలించగా చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అమరుల త్యాగనిరతిని అలవర్చుకోవాలి

అనంతపురం: దేశ ఔనత్యం, దేశ రక్షణ కోసం అమరులైన వీరుల త్యాగ నిరతిని విద్యార్థులు అలవర్చుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్ధన అన్నారు. నా భూమి– నా దేశం (మేరీ మాటి, మేరి దేశ్) అనే కార్యక్రమంలో భాగంగా జేఎన్‌టీయూ అనంతపురం– ఓటీపీఆర్‌ఐ క్యాంపస్‌లో మంగళవారం పంచప్రాణ్ ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల జ్ఞాపకార్థంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీరులు, వీర వనితలకు వందనం సమర్పించారు. పదవీ విరమణ చేసిన సైనికాధికారులైన ఎస్. వెంకటేశ్, ఎం. ఖాసీం సాహెబ్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రాచీన సంస్కృతినీ, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కల్పించిన వర్సిటీ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్, పీఆర్వో డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు కేశ శైలజ, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రణాళికల్లోనూ క్రీడలకు ప్రాధాన్యత


స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విద్యా ప్రణాళిక (కర్రికులమ్)లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ/ వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ పాలక భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో 14వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ అధ్యత వహించి, మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన క్రీడలపై వివరించారు. ఆలిండియా, సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో అత్యధికంగా పతకాలు సాధించే విద్యార్థులు, కోచ్‌లకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బీటెక్ మొదటి సంవత్సరంలో స్పోర్ట్స్ పీరియడ్‌ను కచ్చితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి. జోజిరెడ్డి, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశాలి, పీఆర్వో డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ట్స్ కళాశాల యాజమాన్యం

రాప్తాడురూరల్: ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు సందీప్, నవీన్‌కుమార్, భరత్, సాయినాథ్, ప్రేమ్ కుమార్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ గ్రూపుల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, అబ్‌స్టికల్స్, టెంట్ పిచింగ్, బెస్ట్ క్యాడేట్ రంగాల్లో పోటీలు నిర్వహించారన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జి.రంగనాథ్ మాట్లాడుతూ బాలుర ఎన్‌సీసీ విభాగం నుంచి ఐదేళ్లుగా క్రమం తప్పకుండా రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరవుతున్నారన్నారు. రిపబ్లిక్ డే క్యాంపునకు సమానమైన ఢిల్లీలో జరగబోవు సైనిక్ క్యాంపునకు ఈ విద్యార్థులు తప్పకుండా ఎంపికవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘర్షణలో యువకుడికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డు సర్కిల్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..పెద్దవడుగూరు మండలానికి చెందిన వ్యక్తులు, ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకులో పని చేసే యువకుల మధ్య ఘర్షణ జరిగింది. బంకులో పనిచేసే హనుమంతు అనే యువకుడికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హనుమంతుడికి పిండివంటల నైవేద్యం


హనుమంతుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని చితంబర స్వామి ఆలయం వెనుకవైపు కొండలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం భక్తులు పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. నాగుల చవితి వేడుకల్లో భాగంగా స్వామికి అర్చకుడు మల్లేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నాగుల చవితి సందర్భంగా స్వామికి పిండివంటలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

కొట్టాలపల్లిలో భాగవత శ్రవణం

బుక్కరాయసముద్రం: కొట్టాలపల్లి గ్రామంలో మంగళవారం భాగవత సప్తాహ పఠన, శ్రవణ యజ్ఞం ప్రారంభమైంది. ఏటా శ్రావణ మాసంలో గ్రామంలోని రామాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమం ముగింపు రోజున(28)న గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తామన్నారు.

పశువులకు లంపీస్కిన్ టీకాలు


పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

పామిడి: పశువులకు లంపీ స్కిన్(ముద్ద చర్మ వ్యాధి) రాకుండా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ ఉషాకిరణ్ తెలిపారు. మంగళవారం ఆమె రామరాజుపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పశువులకు లంపీ స్కిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, రైతులు శివ, గోపాల్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బూదేడులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: మండలంలోని బూదేడు గ్రామంలో బుధవారం ఉదయం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

టెక్నీషియన్ అనిల్ సస్పెన్షన్

గుంతకల్లు: స్థానిక డీజిల్ షెడ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్న అనిల్‌ను సస్పెన్షన్ చేస్తూ డీజిల్ షెడ్ జేఈలు ప్రశాంత్, బీ.వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడిచిన ఆదివారం డీజిల్ షెడ్‌కు చెందిన సీనియర్ టెక్నీషియన్ శాంతిరామ్ రైలింజన్‌లోని ప్రెషర్ ఫ్యాన్‌కు రబ్బరు మారుస్తుండగా అదే సమయంలో మరో ఉద్యోగి (టెక్నీషియన్) అనిల్ రైలింజన్ ఆన్ చేయడంతో ఆ ఫ్యాన్ చిక్కుకుని దుర్మరణం చెందిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ జరుపుతున్న సంబంధింత అధికారులు టెక్నీషియన్ అనిల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటించారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

పామిడి: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్మికులు కోరారు. ఈమేరకు మంగళవారం సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్ హౌస్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయికి వినతిపత్రం అందజేశారు.

గొడవలు మానుకోండి

యల్లనూరు: గ్రామాల్లో గొడవలు మానుకోవాలని ఎస్ఐ రామకృష్ణ ఇరువర్గాల నాయకులను హెచ్చరించారు. మంగళవారం ఆయన జంగంపల్లి, బొప్పేపల్లిలో పర్యటించారు. ఈసందర్భంగా ఎస్ఐ ఇరువర్గాల వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. గెలుపోటములు సహజమని, రెచ్చగొట్టే మాటలను మాట్లాడి ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తే జైలుకు పంపుతామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎస్ఎస్ ట్యాంకులకు పంపింగ్


హంద్రీనీవా కెనాల్‌కు చేరిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

గుంతకల్లుటౌన్: హంద్రీ–నీవా సుజల స్రవంతి కెనాల్‌కు చేరిన కృష్ణాజలాలను సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లోకి పంపింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కెనాల్‌కు వచ్చిన నీరు, పంప్‌హౌస్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం ఉదయం 7:30 గంటలకు పంప్‌హౌస్ వద్ద కృష్ణాజలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పంపింగ్‌ను షురూ చేస్తామని కమిషనర్ వెల్లడించారు. కమీషనర్‌తో పాటు డీఈ రామ్మూర్తి, ఏఈలు శ్రీకాంత్, హరిక్రిష్ణ, మున్సిపల్ లైటింగ్ సెక్షన్ ఏఈ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైల్వే డంపింగ్‌యార్డులో జరుగుతున్న లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్‌ను కమిషనర్ పరిశీలించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గార్లదిన్నె: సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్సీ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ ప్రతినెలా 1న వేతనాలు ఇవ్వాలన్నారు. సీఆర్పీల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, జనరల్ సెక్రటరీ సంధ్యారాణి, గోపాలయ్య, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

6న శ్రీకృష్ణ జన్మాష్టమి


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈమేరకు పట్టణంలోని మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ స్వగృహంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌పీరా, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ రంగస్వామి నాయకులు షఫి, మహమ్మద్, ప్రభోద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆహార సలహా కమిటీ సమావేశం


యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆహార సలహా సంఘం కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. కార్యక్రమానికి కమిటీ సభ్యులతోపాటు మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

రైల్వే డీజిల్ షెడ్‌లో నిరసన


నిరసన తెలుపుతున్న రైల్వే కార్మికులు

గుత్తి: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రటరీ రామాంజనేయులు మాట్లాడారు. నూతన పెన్షన్ విధానం వల్ల రైల్వే ఉద్యోగులకు, కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు త్యాగరాజు, జాన్సన్ బాబు, దాదా ఖలందర్, రంగనాయకులు, పాల్గొన్నారు.

రూ.వెయ్యితో రూ.20 లక్షల ప్రమాద బీమా


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్ఎం రమేష్

పామిడి: ఏడాదికి రూ.వెయ్యి ప్రీమియం చెల్లిస్తే రూ.20 లక్షల బీమా పొందొచ్చని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐలో ప్రమాద బీమా పథకానికి సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.500 ప్రీమియం చెల్లించడం ద్వారా రూ.10 లక్షలు బీమా పొందచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: కుందనకోటలో మంగళవారం నిర్వహించిన ప్రజాసంక్షేయ యాత్రలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నాయకులు కోనా లింగేశ్వరరెడ్డి, విరూపాక్ష రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, క్రిష్టారెడ్డి, రామిరెడ్డి, తిరుమల రెడ్డితో పాటు మరో 3 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

తిరుపతి, మదనపల్లెకు ఆర్టీసీ సర్వీసులు

తాడిపత్రి: ప్రయాణికుల సౌకర్యార్థం తాడిపత్రి డిపో నుంచి తిరుపతి, మదనపల్లెకు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జీఎల్.శంకర్ తెలిపారు. తిరుపతి సర్వీసు రోజూ తాడిపత్రి డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి వైఎస్సార్ జిల్లా తాళ్లప్రొద్దుటూరు, సింహాద్రిపురం, పులివెందుల, వేంపల్లి, గండి, రాయచోటి, పీలేరు మీదుగా తిరుపతికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి అదే బస్సు మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు తాడిపత్రికి చేరుకుంటుందన్నారు. తాడిపత్రి నుంచి మదనపల్లెకు రోజూ ఉదయం 6.15కు బయలుదేరి వైఎస్సార్ జిల్లా తాళ్లప్రొద్దుటూరు, సింహాద్రిపురం, పులివెందుల, సత్యసాయి జిల్లాలోని కదిరి మీదుగా మదనపల్లికి ఉదయం 11.45 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 12.30కు బయలుదేరి సాయంత్రం 5.30కు తాడిపత్రికి చేరుకుంటుదని వివరించారు.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు

తాడిపత్రి: శ్రావణ మాసం సందర్భంగా కసాపురం, మురడి, నేమకల్లు క్షేత్రాల దర్శనం కోసం(హనుమాన్ దర్శన) తాడిపత్రి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ జీఎల్.శంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసంలోని ప్రతి మంగళ, శనివారాల్లో తాడిపత్రి డిపో నుంచి సర్వీసులను నడుపనున్నట్లు పేర్కొన్నారు. పెద్దలు రూ.538, చిన్నారులు రూ. 270తో మూడు క్షేత్రాలను దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు.

ఆధార్ నమోదు తప్పనిసరి

గుంతకల్లు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి రైతు తన బ్యాంకు అకౌంట్‌తోపాటు, భూమికి ఆధార్‌లింక్ చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పొలాలకు ఆధార్ లింక్ లేని కారణంగా మండలంలో 218 మంది రైతులకు, బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ లేని కారణంగా మరో 78 మంది రైతులకు పీఎం కిసాన్ జమ కాలేదని తెలియజేశారు. ఈ రైతులు వెంటనే సచివాలయం, బ్యాంకుల్లో ఆధార్ నమోదు చేసుకోవాలని లేని పక్షంలో ఈక్రాప్ నమోదు చేసుకోలేమన్నారు.

రేపు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ కానుకల లెక్కింపు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి శాశ్వత హుండీ కానుకలను లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో కానుకలు లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని సూచించారు.

రైతు ఆత్మహత్య


రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

పెద్దవడుగూరు : మేడిమాకులపల్లిలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోట రాజశేఖర్ రెడ్డి(32)మృతుడు తన 5 ఎకరాల పొలంలో పత్తి, మరో 20 ఎకరాల దాకా కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. ఇందుకోసం తోటి రైతుల వద్ద సుమారుగా రూ.16 లక్షల దాకా అప్పులు చేశాడు. విత్తనం వేసి మాసం గడుస్తున్నా వర్షాలు రాకపోవడంతో మిరప పంట ఎండుముఖం పట్టింది. పెట్టుబడికి పెట్టిన సొమ్ము కూడా వస్తుందో రాదోనని భావించాడు. ఈక్రమంలో తీవ్ర ఆందోళనకు గురై సోమవారం సాయంత్రం పొలం వద్దకు పురుగుల మందు తాగి మిత్రులకు చెప్పాడు. రాత్రి 11 గంటల సమయంలో అపస్మారకస్థితిలో ఉన్న అతడిని అనంతపురం తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.